సాక్షి
తిరుపతి
మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఓ టెంపో బోల్తా పడింది. 20 టన్నుల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



గరుడ వాహనంపై చిద్విలాసం

పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారు బంగారు గరుడ వాహనంపై విహరిస్తూ కనువిందు చేశారు. - 8లో



డంపింగ్ కేంద్రంలో మంటలు

సూళ్లూరుపేటలోని కాళంగి నది ఒడ్డున జాతీయ రహదారికి పక్కనే ఉన్న డంపింగ్ యార్డుకు మంటలంటుకున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

ఎస్వీబీసీ మాజీ చైర్మన్‌ను కలిసిన ఎంపీ



వెంకటగిరి రాజా ప్యాలెస్‌లో సాయికృష్ణయాచేంద్రతో ఎంపీ గురుమూర్తి

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి రాజా కుటుంబీకులు, ఎస్వీబీసీ మాజీ చైర్మన్ డాక్టర్ వీబీ.సాయికృష్ణ యాచేంద్రను తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి సోమవారం వెంకటగిరిలోని రాజా ప్యాలెస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సాయికృష్ణ యాచేంద్ర ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంఏ నారాయణ, యస్థాని, కే.రమేష్, జలగం కామాక్షి, గురుస్వామినాయుడు ఉన్నారు.

సముద్రంలోకి 440 తాబేళ్ల పిల్లలు



తాబేలు పిల్లలను సముద్రంలో విడిచి పెడుతున్న సిబ్బంది

వాకాడు: మండలంలోని నవాబుపేట సముద్ర తీరంలో సోమవారం ఫారెస్టు అధికారుల సమక్షంలో పిల్లలు ఉత్పత్తి చేసే ఆలీవ్ రిడ్లీ తాబేళ్ల పిల్లలను సముద్రంలో విడిచి పెట్టారు. ఈ ఏడాది మూడో దఫా నవాబుపేట వద్ద ఉన్న తాబేళపిల్లల సంరక్షణా కేంద్రం(హేచరీ)లో దాదాపు 475 గుడ్లను సేకరించి పొదిగించారు. అందులో 440 పిల్లలు ఆరోగ్యంగా బయటకు రావడంతో వాటిని సముద్రంలో విడిచి పెట్టారు. తాబేళ్లను చంపినా, వేటాడినా చట్టరీత్యా నేరమని ఫారెస్టు అధికారులు తెలిపారు.

వేటకు వెళ్లొద్దు



రాజేష్, మత్స్యశాఖ జిల్లా అధికారి

వాకాడు: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో చేపల వేట నిషేధించారని, వేటకు ఎవ్వరూ వెళ్లొద్దని జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యశాఖ నిషేధ ఆజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏపీ ఎంఆర్‌ఎఫ్ 1994 సెక్షన్(4)ను అనుసరించి శిక్షార్హులు అవుతారని, అలాగే వారి బోట్లలో ఉండే మత్స్య సంపదను స్వాధీనం చేసుకుని, జరిమానా విధించి, రాయితీలు రద్దు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్



కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు



షార్‌లో ఎస్సీ, ఎస్టీ దళిత సంఘాల నేతలు

తిరుపతి జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో భారత రాజ్యాంగ నిర్మాత చిత్రపటానికి పూల మాలలు వేసి ఆత్మీయంగా నివాళి అర్పించారు. ఆదర్శనీయుడు అంబేడ్కర్ అని వక్తలు కొనియాడారు. ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో అడుగులు వేయాలని యువతకు పిలుపునిచ్చారు. పలు నియోజకవర్గాల్లో ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు అన్నదానం నిర్వహించారు. జయహో అంబేడ్కర్.. జై భీమ్ అంటూ నినాదాలు మిన్నంటించారు.

– తిరుపతి మంగళం

ఇది నా అడ్డా!

యే..బిడ్డా..! ఇది నా అడ్డా..! అన్నట్టు నెల్లూరుకు చెందిన ఓ ముఖ్య నేత చెలరేగిపోతున్నారు. గూడూరు మండలం, చెన్నూరులో మూతపడ్డ ఓ మైన్‌ను అడ్డం పెట్టుకుని అక్రమవ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. స్థానిక కూటమి నేతలను పక్కకు నెట్టి ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తెల్లరాయి తవ్వి తరలించేస్తున్నారు. గత నాలుగు నెలలుగా ఈ అక్రమ దందా సాగిస్తున్నారు. అధికారులు సైతం ఆయనకు అడ్డురాకపోవడం విమర్శలకు తావిస్తోంది.



మైన్‌కు సమీపంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ తవ్వకాలు



ఖనిజాన్ని గ్రహించలేరా?

- కాలం చెల్లిన మైన్‌ను అడ్డుపెట్టుకుని తవ్వకాలు
- చెలరేగిపోతున్న నెల్లూరుకు చెందిన ప్రజాప్రతినిధి
- గతంలో ఉన్న మెటీరియల్ పేరుతో అనుమతులు
- బయట తవ్వి అదే పర్మిట్లతో తరలింపు
- గుర్రుమంటున్న స్థానిక కూటమి నేతలు
- కన్నెత్తి చూడని అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గూడూరు మండలం, చెన్నూరులో మూతపడ్డ శ్రీనివాస మైన్‌ని అడ్డం పెట్టుకుని నెల్లూరుకు చెందిన ఓ ప్రజాప్రతినిధి చెలరేగిపోతున్నారు. స్థానిక కూటమి నేతలను పక్కకు నెట్టి తన రాజకీయ పలుకుబడితో దందా సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ముందుగా మైన్‌లో ఉన్న ఖనిజాన్ని తరలించేందుకు పర్మిట్లు పొందారు. ఆపై ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి అక్కడ సేకరించే తెల్లరాయిని సదరు మైన్‌కి తరలించి గ్రేడింగ్ చేస్తున్నారు. తర్వాత ఎంచక్కా టిప్పర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత నాలుగు నెలలుగా కొన్నివేల టన్నుల క్వార్ట్జ్ ఖనిజం తరలిస్తున్నా అటువైపు కన్నెత్తి చూసేందుకు ఏ ఒక్క అధికారీ సాహసించకపోవడం గమనార్హం.

అక్రమ తవ్వకాలకు పోటాపోటీ

శ్రీనివాసా మైన్‌ని సాకుగా చూపి క్వార్ట్జ్ ఖనిజాన్ని కొల్లగొట్టేందుకు కూటమి నేతలు స్కెచ్ వేశారు. ఇందులో భాగంగానే సదరు మైన్‌కు సంబంధించి ఓ భాగస్వామిని పక్కకు నెట్టి అందులో ఉన్న మెటీరియల్‌ను తరలించేందుకు సిద్ధమయ్యారు. ఆ భాగస్వామి కోర్టును ఆశ్రయించినా అతన్ని కాదని స్థానిక ప్రజాప్రతినిధి అండతో కొందరు కూటమి నేతలు తవ్వకాలకు తెగబడ్డారు. విషయం తెలుసుకున్న నెల్లూరుకు చెందిన ఓ పెద్ద ప్రజాప్రతినిధి రంగంలోకి దిగారు. తన అనుచర గణంతో అక్కడ పాగా వేశారు. ముందుగా సదరు మైన్‌లో ఉన్న మెటీరియల్‌ను తరలించేందుకు రాష్ట్ర స్థాయిలో పైరవీలు చేసి అనుమతులు పొందారు. ఆపై మైన్‌కు దగ్గరగా ఉన్న ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు చేపట్టి అక్కడ సేకరించిన తెల్లరాయిని అదే మైన్‌కి తరలించి గ్రేడింగ్ చేస్తున్నారు. పాత మెటీరియల్ కింద ప్రతి రోజూ కనీసం పది టిప్పర్లకు తక్కువ లేకుండా క్వార్ట్జ్ ఖనిజాన్ని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత నాలుగు నెలలుగా ఈ దందా సాగుతోంది.

ఆధారాలిచ్చినా అడ్డుకోవడమేనా?

శ్రీనివాస మైన్‌ను అడ్డంపెట్టుకుని అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని, దీనికి సబంధించిన ఆధారాలను నాలుగు రోజుల క్రితం గూడూరు డీఎస్పీ, సబ్ కలెక్టర్‌కు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అందించారు. ఈ క్రమంలో ఆ ప్రాంతాన్ని సందర్శించేందుకు తమకు అనుమతులు ఇవ్వాలని ఆయన అధికారులను అభ్యర్థించారు. దానికి అప్పట్లో సదరు అధికారులు ఒప్పుకున్నట్టుగా మిన్నకుండిపోయారు. ఆపై మైన్ వద్దకు మేరిగ బయలుదేరే సమయంలో అనుమతులు లేవంటూ మెలిక పెట్టి హౌస్ అరెస్ట్‌కు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న అక్రమార్కులు మైన్‌లో ఉన్న చిన్నచిన్న వాహనాలను సైతం రాత్రికి రాత్రే తరలించేశారు. బ్లాస్టింగ్ సైతం ఆపేశారు.



తెల్లరాయి తవ్వకాలతో చెరువును తలపిస్తున్న ప్రభుత్వ భూమి



రాత్రికి రాత్రే తరలుతున్న వాహనాలు

ఇది తప్పకాదా రాజా?

గతంలో తవ్వకాలు జరిపారంటూ నెల్లూరుకు చెందిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిపై అక్రమ కేసులు బనాయించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. అయితే తాజాగా అదే కూటమికి చెందిన ఓ నేత అందరి కళ్లెదుటే తవ్వకాలు జరుపుతున్నా ఆయనపై ఎలాంటి చర్యలకు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

టీడీపీ పతనం ఖాయం

- రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టించిన వెంకటగిరి మున్సిపల్ అవిశ్వాస తీర్మానం
- 2027లో జమిలీ ఎన్నికలు రావడం తథ్యం



కౌన్సిలర్లతో కలిసి మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ పై కూటమి ప్రభుత్వం పెట్టిన అవిశ్వాస తీర్మానం రాష్ట్రంలోనే ప్రకంపనలు సృష్టించిందని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో సోమవారం ఆయన మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అధికార మదంతో కూటమి ప్రభుత్వం కుట్రలకు పాల్పడినట్లు ఆరోపించారు. అధికారులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పాటిస్తూ కౌన్సిలర్ల ఇళ్లకు వెళ్లి బెదిరింపులు, ఒత్తిళ్లకు గురిచేశారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిబద్ధతో 19 మంది కౌన్సిలర్లు ప్రలోభాలకు గురికాకుండా అవిశాస తీర్మానంలో దీటుగా ఎదుర్కొన్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం బలం లేక చతికిల పడిందన్నారు. ఇది రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయిందని చెప్పారు. ఈ విజయాన్ని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కానుకగా ఇచ్చినట్టు తెలిపారు. 2027లో జమిలీ ఎన్నికలు రావడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, విప్ పుజారి లక్ష్మి, వైస్‌చైర్మన్ చింతపట్ల ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు ధనియాల రాధ, తంబా సుఖన్య, కళ్యాణి, వహిద, సుబ్బారావు, శివయ్య, పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, జిల్లా సంయుక్త సహాయక కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్టాన్ని రద్దు చేయండి



వక్ఫ్‌బోర్డ్ బిల్లుకు వ్యతిరేకంగా రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనారిటీ నాయకులు

- ముస్లింల నిరసన

తిరుపతి మంగళం : దేశంలో ముస్లిం, మైనారిటీలను అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, ఇందులో భాగంగానే వక్ఫ్‌బోర్డ్ బిల్లును తీసుకొచ్చిందని వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు సయ్యద్ షఫీ అహ్మద్‌ఖాదరీ, మహ్మద్ కాసీమ్‌బాషా, షేక్ ఇమ్రాన్ బాషా ఆరోపించారు. వక్ఫ్‌బోర్డ్ బిల్లును వెంటనే రద్దు చేయాలంటూ తిరుపతి మహతి ఆడిటోరియం వద్ద ఉన్న పెద్ద మసీదు వద్ద సోమవారం వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనారిటీ నగర అధ్యక్షులు మహ్మద్ కాసీమ్‌బాషా(చోటాబాయ్) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగాన్ని నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజున వక్ఫ్‌బోర్డ్ బిల్లుకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టినట్టు తెలిపారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డ్ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కోట్లాది మంది ముస్లింల భూములను కొట్టేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలతో వక్ఫ్‌బోర్డ్ బిల్లును ప్రవేశపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు టీడీపీ జనసేన పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి మద్దుతు ఇచ్చి ముస్లింలకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. ముస్లింల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకించాల్సిన బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. నిత్యం ముస్లింల సంక్షేమాన్ని ఆకాంక్షించే మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వక్ఫ్‌బోర్డ్ బిల్లును వ్యతిరేకించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు ఖాదర్‌బాషా, గఫూర్, కబీర్, ఇస్మాయిల్, ముజాబింద్, జారీద్, మొదిసీన్, చాన్‌బాషా, అన్వర్, హాజి షేక్ ఫరీతాప్, షేక్ సలీమ్, ఎస్‌కె.కలీమ్, ఎస్. అమీర్‌బాషా పాల్గొన్నారు.

ఏపీ జీఈఏ ఐక్యవేదిక కోచైర్మన్‌గా బాలాజీ



చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్యవేదిక (ఏపీ జీఈఏ ఐక్య వేదిక) కోచైర్మన్‌గా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు శవన్న గారి బాలాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 13 న విజయవాడలోని విద్యాధరపురంలో ఏపీ జీఈఏ చైర్మన్ సూర్యనారాయణ అధ్యక్షన ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘంలో మండల స్థాయి నుంచి ఎదిగి రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రస్తుతం బాలజీ సేవలందిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని తెలిపారు. ఆయనకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వెంకట సత్యనారాయణ, రాష్ట్ర సంఘటన కార్యదర్శి సిహెచ్ శ్రావణ్ కుమార్, చిత్తూరు, తిరుపతి జిల్లాలోని టీచర్లు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 79,100 మంది స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది.

విన్నమాల అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి



విన్నమాల క్రాస్ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి

నాయుడుపేట టౌన్ : చెన్నై – కలకత్తా 16వ నంబర్ జాతీయ రహదారి విన్నమాల వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి తనవంతు కృషిచేస్తానని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి పేర్కొన్నారు. విన్నమాల గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు సోమవారం విన్నమాల జాతీయ రహదారి కూడలి ప్రాంతాన్ని ఎంపీ పరిశీలించారు. విన్నమాల జాతీయ రహదారి కూడలి వద్ద ఐదు గ్రామాలకు పైగా రోజూ రాకపోకలు సాగిస్తుంటారని, రోడ్డు దాటుతూ అనేక మంది మరణించిన సంఘటనలు ఉన్నాయని గ్రామస్తులు ఎంపీకి వివరించారు. స్పందించిన ఎంపీ వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఈ సమస్యను కేంద్ర మంత్రి, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. విన్నమాల జాతీయ రహదారి కూడలి వద్ద అండర్ పాస్ బ్రిడ్జితో పాటు సాగరమాల జాతీయ రహదారికి సంబంధించి రైతుల పొలాలు సాగుచేసుకునేందుకు సర్వీస్ రోడ్లు నిర్మించే విధంగా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. సాగరమాల జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కేంద్ర మంత్రులతో పాటు ఉన్నతాధికారులను సైతం స్వయంగా కలిసి విన్నవించినట్లు ఎంపీ వెల్లడించారు. ప్రజాసంక్షేమానికి ఎల్లప్పుడూ ముందుంటామని చెప్పారు. ఎంపీ వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగిరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, తిప్పలపూడి నాగరాజు, మీజూరు సుబ్రమణ్యం, విన్నమాల గ్రామస్తులు ఉన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

తిరుపతి క్రైమ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక సేవ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అగ్నిమాపక శాఖ కార్యాలయంలో తిరుపతి సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏదైనా ప్రమాదాలు జరిగితే వాటిని ఎలా నివారించాలన్న దానిపై ప్రజలకు పూర్తిస్థాయిలో ఈ వారం మొత్తం అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

– మరొక బాలుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన షాహిదీ ఉల్లా

తడ: జాతీయ రహదారి తడ ఐటీఐ కళాశాల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఓ యువకుడు మృతి చెందగా, మరో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ కొండపనాయుడు తెలిపిన వివరాల మేరకు.. బీఏ ఫైనలియర్ చదువుతున్న చెన్నై రాయపేట ప్రాంతానికి చెందిన సయ్యద్ షాహిదీ ఉల్లా(20) అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ పర్వాన్(15)తో కలిసి బైక్‌పై వరదయ్యపాళెం సమీపంలో ఉన్న వాటర్ ఫాల్స్‌కి బయలుదేరారు. తడ ఐటీఐ కళాశాల సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ బైక్‌ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌తోపాటు రోడ్డుపై పడ్డ ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ షాహిదీ ఉల్లా మృతి చెందాడు. తీవ్ర గాయాలతో ఉన్న పర్వాన్‌ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చెన్నైకి తీసుకెళ్లారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


గాయపడిన వ్యక్తి మృతి

దొరవారిసత్రం : గత నెల 19న దొరవారిసత్రం మండల కార్యాలయాల సమీపంలో బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పాళెంపాడు గ్రామానికి చెందిన మల్లాం మనోహర్(53) సొంత పనుల నిమిత్తం బైక్‌లో వచ్చాడు. తిరిగి వెళుతుండగా దొరవారిస త్రం మండల కార్యాలయాల సమీపంలో బైక్ అదు పుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కుటుంబ సభ్యులు నాయుడుపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టాన్ని గుర్తించకుంటే నష్టం!

- గూడూరుకు చెందిన రాజేష్‌కు ఆర్ట్స్ గ్రూపు అంటే ఇష్టం. చిన్నతనం నుంచే సోషియల్‌పై మంచి పట్టుసాధించాడు. గ్రూప్స్ రాయాలనేది అతని కోరిక. పది పూర్తయ్యాక ఆర్ట్స్ గ్రూపులో చేరాలనుకున్నాడు. అయితే ఇంట్లో పెద్దల బలవంతంతో ఎంపీసీలో చేరాడు. ఇష్టం లేని గ్రూపును సరిగా చదవలేక ఫెయిలయ్యాడు.
- తిరుపతికి చెందిన విద్యాసాగర్‌కు చిన్నతనం నుంచే చార్టెడ్ అకౌంటెంట్ చేయాలన్నది కోరిక. పది పూర్తయ్యాక ఎంఈసీలో చేరాలనుకున్నాడు. తల్లిదండ్రులేమో తమ కొడుకును ఇంజినీరుగా చూడాలనుకున్నారు. తమ అభిప్రాయాన్ని పిల్లాడిపై రుద్ది బలవంతంగా ఎంపీసీలో చేర్పించారు. అయిష్టంతోనే ఎంపీసీ పాస్ మార్కులతో గట్టెక్కాడు. ఇంజినీరింగ్‌లో సీటు రాకపోవడంతో డిగ్రీలో ఆర్ట్స్ గ్రూపును తీసుకున్నాడు.
- పుత్తూరుకు చెందిన దీపికకు చిన్నప్పటి నుంచే మ్యాథ్స్ అంటే ఇష్టం. ఇంజినీరింగ్ చేయాలన్నది ఆమె కోరిక. తల్లిదండ్రులకేమో తన కుమార్తెను డాక్టరుగా చూడాలనుకున్నారు. డాక్టరును చేయాలనే తపనతో బైపీసీలో బలవంతంగా చేర్పించారు. పాస్‌మార్కులతో గట్టెక్కడంతో మెడిసిన్‌లో సీటు రాలేదు. అప్పటికిగాని తల్లిదండ్రులు తమ తప్పును తెలుసుకోలేకపోయారు.
- సూళ్లూరుపేటకు చెందిన మనోజ్‌కుమార్ సాధారణ విద్యార్థి. పదోతరగతి పాస్ మార్కులతో గట్టెక్కాడు. గణితం, సైన్సు సబ్జెక్టులపై పట్టు లేదు. అయితే స్నేహితులు ఎంపీసీ, బైపీసీ తీసుకోవడంతో తాను గొప్పగా చెప్పుకోవడానికి ఎంపీసీని ఎంచుకున్నాడు. సబ్జెక్టులు కష్టం కావడంతో ఇంటర్ తప్పాడు. ఏం చేయాలో తెలియక చదువును పక్కనబెట్టాడు.

వీరే కాదు.. జిల్లాలో చాలా మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య ఇది. ఇష్టమైన సబ్జెక్టుపై మక్కువ పెంచుకుని అందులో రాణించాలనుకున్న చాలా మంది విద్యార్థులకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఆలోచనలు, అభిప్రాయాలతో రాణించలేకపోతున్నారు. ఇంటర్ ప్రవేశం సమయంలో తల్లిదండ్రుల బలవంతంతో కొందరు, గొప్పగా చెప్పుకోవాలనే ఆలోచనతో మరికొందరు ఇష్టం లేని గ్రూపుల వైపు అడుగులేసి చతికిలపడుతున్నారు. తిరిగి సాధారణ చదువులను కొనసాగిస్తున్నారు.



తల్లిదండ్రుల నిర్ణయాలు.. పిల్లలకు కష్టాలు

- గ్రూపుల ఎంపికలో పిల్లలకే స్వేచ్ఛనివ్వాలి
- ఇంటర్ ప్రవేశంపై సలహా తప్ప నిర్ణయం వద్దంటున్న నిపుణులు

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యార్థి దశలో ఇంటర్ కీలకం. ఈ దశలో పడిన అడుగు జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికే పది పరీక్షలు రాసి ఇంటర్ ప్రవేశాల కోసం వేలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. పిల్లల ఆసక్తిని తెలుసుకుని ప్రోత్సహించాలి. అప్పుడే పిల్లలు వారు కలలుగన్న రంగంలో రాణించగలుగుతారు.

ఇష్టాన్ని గుర్తించాలి

పిల్లల ఇష్టాలను పక్కనబెట్టి డాక్టర్, ఇంజినీర్ చేయాలని తల్లిదండ్రులు కలలుకంటున్నారు. తమ అభిప్రాయాలను పిల్లలపై రుద్దుతున్నారు. మేము చెప్పే కోర్సులను తీసుకోవాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. దీంతో తమ కోర్కెలను పక్కనబెట్టి తల్లిదండ్రులు చెప్పిన కోర్సులో చేరి రాణించలేకపోతున్నారు. పిల్లల ఇష్టాన్ని గుర్తించినప్పుడే రాణిస్తారన్న సత్యాన్ని తల్లిదండ్రులు తెలుసుకోవాలని మానసిక శాస్త్రవేత్తలు హితవు పలుకుతున్నారు.

స్వేచ్ఛనివ్వాలి

జిల్లాలో పదోతరగతి పరీక్షలను ఈ ఏడాది 52,065మంది విద్యార్థులు రాశారు. వీరిలో కొందరు ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో చేరేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇంకొందరు ప్రభుత్వ కళాశాలల్లో చేరనున్నారు. మరికొందరు పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసి వంటి పోటీ పరీక్షల ద్వారా ఆయా కోర్సుల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. పాస్ మార్కులతో గట్టెక్కిన విద్యార్థులు తక్కువ సమయంలో ఉపాధి లభించే ఐటీఐ, ఒకేషనల్ కోర్సులను ఎంచుకుంటున్నారు. సామర్థ్యాన్ని అంచనా వేసుకుని ఇప్పటికే విద్యార్థులు ప్రణాళిక రచించుకున్నారు. ఇలాంటి సమయంలో ఏది ఉత్తమం, ఏ కోర్సులు తీసుకోవాలి వంటి సలహాలు ఇవ్వడం వరకే తల్లిదండ్రులు తమ బాధ్యతగా భావించాలి. అంతేతప్ప ఇష్టాలను రుద్దడం చేయకూడదని, గ్రూపుల ఎంపికలో పిల్లలకే స్వేచ్ఛనివ్వాలని నిపుణులు చెబుతున్నారు.

నచ్చిన గ్రూపులోనే చేర్పించాలి



పది తరువాత ఇంటర్ ప్రవేశంలో పిల్లలకే స్వేచ్ఛనివ్వాలి. వారికి నచ్చిన గ్రూపులో చేరేందుకు సహకరించాలి. తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను చెప్పడం వరకే సరిపెట్టుకోవాలి. అంతేతప్ప ఇరుగుపొరుగు పిల్లలతో పోల్చుతూ బలవంతం చేయకూడదు. –డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి, విద్యావేత్త, తిరుపతి

బలవంతం వద్దు



పిల్లల చదువు విషయంలో పెద్దలు బలవంతం చేయకూడదు. మన ఆలోచనలను వాళ్లపై రుద్దకూడదు. సమాజంలో ఇంజినీరింగ్, మెడిసిన్ రంగాలే కాదు... ఇంకా న్యాయ, విద్య, మేనేజ్‌మెంట్ వంటి చాలా రంగాలున్నాయి. తగిన కోర్సులకు ప్రాధాన్యత ఇస్తేనే వారు రాణించగలుగుతారు. – శ్రీధర్, కెరీర్ గైడెన్స్ నిపుణులు, తిరుపతి



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.96,880
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,746
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.98,200
రిటైల్ వెండి గ్రాము	రూ.101.20

22 నుంచి డిగ్రీ పరీక్షలు

తిరుపతి సిటీ: ఈ నెల 22 నుంచి మే 10 వరకు ఎస్వీయూ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో రెండవ, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు వర్సిటీ అధికారులు కళాశాలలకు పరీక్షల షెడ్యూల్ పంపించారు. విద్యార్థులకు ఈ నెల 19 నుంచి హాల్ టికెట్లు అందజేయనున్నారు.

దుప్పిని చంపిన కేసులో నిందితుడి అరెస్టు

సైదాపురం : దుప్పిని చంపిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు నెల్లూరు అటవీశాఖ రేంజర్ ఎస్ మాలాద్రి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని చాగణం గ్రామానికి చెందిన సాయిరాం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించి దుప్పిని చప్పి మాంసాన్ని ఇంట్లో నిల్వ చేశాడని తెలిపారు. స్థానికుల సమాచారంతో గ్రామానికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అతన్ని నెల్లూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు పంపిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని వివరించారు. జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్ బాషా మాట్లాడుతూ ఎవరైనా వన్యమృగాలను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెక్షన్ అధికారులు లోకేష్, శ్రీనివాసులు, బీట్ అధికారులు విజయ్, శ్రావణ్, గిరిజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై చిద్విలాసం



బంగారు గరుడ వాహనంపై పెనుశిల లక్ష్మీనరసింహస్వామి



ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి చందనాలంకరణలో కనువిందు చేశారు. సోమవారం స్వాతి నక్షత్రం శ్రీవారి జన్మనక్షత్రం కావడంతో స్వామివారి మూల మూర్తికి చందనంతో అలంకరించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం అభిషేకం, చందనాలంకరణ, పుష్పాలంకరణ, 9 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, కల్యాణం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామివారు బంగారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తలుగా దేవస్థాన ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, రాజ్యలక్ష్మి వ్యవహరించారు.

20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం తరలిస్తూ బోల్తాపడిన వాహనం

పెళ్లకూరు: 71వ నంబరు జాతీయ రహదారి మార్గంలో దిగువచావలి ఫ్లైఓవర్‌పై శ్రీకాళహస్తి నుంచి నెల్లూరుకు రేషన్ బియ్యం లోడ్డుతో వెళ్తున్న వాహనం టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తాపడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, అధికారుల సమాచారం మేరకు.. శ్రీకాళహస్తి నుంచి నెల్లూరుకు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనం మార్గమధ్యంలో దిగువచావలి గ్రామం ఫ్లై ఓవర్‌పై టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే బియ్యం వ్యాపారులు వాహనంలోని 20 టన్నుల బియ్యాన్ని గ్రామంలోని రహస్య ప్రదేశానికి తరలించారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ నాగరాజు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లై డీటీ గోపీనాథరెడ్డి, తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి సమాచారం అందించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని వీఆర్వోలు రమేష్, వంశి నాయుడుపేట గోదాముకు తరలించి కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

అంబేడ్కర్ స్ఫూర్తికి బీజేపీ తూట్లు



తిరుపతిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

తిరుపతి కల్చరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తికి బీజేపీ తూట్లు పొడుస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తిరుపతిలోని గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పును బీజేపీ నేతలు బేఖాతరు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చట్టసభలపై కోర్టుల జోక్యం ఎక్కువైందని గవర్నర్లు వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. గవర్నర్ తరహా పాలనను రద్దు చేసి చట్టసభలకు తగినంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగాన్ని మతోన్మాదుల నుంచి పరిరక్షించుకోవడానికి పౌరులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీటీడీని రాజకీయ లబ్ధి కోసం ఏ పార్టీ వాడకూడదని సూచించారు.

డంపింగ్ కేంద్రంలో మంటలు



కాళంగి నదికి పక్కనే పోసిన డంపింగ్‌లో చెలరేగిన మంటలు



జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

సూళ్లూరుపేట: పట్టణంలోని కాళంగి నదికి పక్కనే జాతీయ రహదారికి అనుకుని ఉన్న డంపింగ్ యార్డులో సోమవారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. జాతీయ రహదారిపై దట్టమైన పొగ కమ్మేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సూళ్లూరుపేట పట్టణాన్ని 2010లో మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. కానీ ఇప్పటివరకు సరైన డంపింగ్ యార్డు లేదు. రోజు వారీగా పట్టణం నుంచి 19 టన్నుల చెత్త వస్తోంది. ఈ చెత్త అంతా కాళంగి నదికి పక్కనే ఉన్న పొర్లుకట్టకున్న స్థలంలో డంప్ చేస్తున్నారు. ఆపై తరచూ మంట పెట్టడంతో పట్టణమంతా దట్టమైన పొగ అలముకుంటోంది. వట్రపాళెం, ఇందిరానగర్, మహదేవయ్య నగర్, వనంతోపు, గణపతినగర్, ఝాన్సీనగర్, శ్రీనగర్‌కాలనీ, సూళ్లూరు, నాగరాజుపురం లాంటి ప్రాంతాలతోపాటు సూళ్లూరుపేట పట్టణమంతా పొగ కమ్మేస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. చెన్నై–కోల్‌కత్తా ఏషియన్ రహదారికి పక్కనే డంపింగ్ కేంద్రాన్ని మార్పు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా ఉమాపతి



వరదయ్యపాళెం: సమాచార హక్కుచట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా సత్యవేడు మండలం, మాదనపాళెం గ్రామానికి చెందిన సూరతిని ఉమాపతి నియమితులయ్యారు. ఆ మేరకు సోమవారం ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ నుంచి ఉత్తర్వులందజేసినట్లు ఆయన వివరించారు. ఉమాపతి మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో సమాచార హక్కు చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఆ చట్టం విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు



మృతిచెందిన సురేష్



మృతిచెందిన సరస్వతమ్మ



రాపూరు ప్రభుత్వాస్పత్రిలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) సురేష్ (ఫైల్), సరస్వతమ్మ (ఫైల్)

- కారు ఢీకొని ఇద్దరి మృతి
- రాపూరులో విషాదం

రాపూరు: కారు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఇద్దరిని పొట్టనపెట్టుకుంది. ఈ ఘటన రాపూరులో విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం.. రాపూరుకు చెందిన గంధం సరస్వతమ్మ (46) తమ తోట వద్ద వదలాలని గార్లపాటి సురేష్ (26)ను కోరింది. దీంతో ఇద్దరూ మోటారు బైక్‌లో సమీపంలోని తోటవద్దకు వెళ్లారు. అక్కడ బైక్ దిగుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా వారిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో పారిపోతుండగా స్థానికులు పట్టుకుని అప్పగించినట్టు పోలీసులు పేర్కొన్నారు. వీరు రాజంపేట విద్యానగర్‌కు చెందిన రామచంద్ర, మల్లికార్జునగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకట్‌రాజేష్ తెలిపారు.

పెన్ను పెట్టాలంటే.. పైసలివ్వాల్సిందే

- ఓ వీఆర్వో వసూళ్ల దందా
- భూ రికార్డులు మార్చేసి రైతుల మధ్య తగాదాలు



దక్కిలి తహసీల్దార్ కార్యాలయం

దక్కిలి : మండలంలో ఓ వీఆర్వో స్టైలే వేరుగా ఉంది. ఆయన పెన్ను పెట్టాలంటే పైసలివ్వాల్సిందే. ఆయన గతంలో రాపూరు, బాలాయపల్లి, మర్రిపాడు, దక్కిలి మండలాల్లో వీర్వోగా పనిచేశారు. ఆయా మండలాల్లో పనిచేస్తున్న సమయంలో విధులకు డుమ్మా కొట్టడం, ఎక్కడో ఓ రూమ్‌లో కూర్చొని రికార్డులు మార్చడం జరుగుతూ వచ్చేది. విషయం తెలుసుకున్న ఆయా మండలాల తహసీల్దార్లు అప్పట్లో ఆయనపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో ఆయన పలుమార్లు సస్పెండ్‌కు గురయ్యారు.

రైతులను పీల్చిపిప్పి చేయడమే పని

సదరు వీఆర్వో ఇటీవల మళ్లీ దక్కిలిలో వీఆర్వోగా బాధ్యతలు చేపట్టారు. ఆయన చేరినప్పటి నుంచి రైతుల నుంచి దండుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఆయన పనిచేసే నాగవోలు, వడ్డమోపూరు సచివాలయాల పరిధిలోని మోపూరు వెల్లంపల్లి, దండవోలు, చాపలపల్లి, మిట్టపాళెం, చెన్నసముద్రం, తిమ్మనగుంట, వడ్డీపల్లి పెదయాచసముద్రం గ్రామాల్లో ఇటీవల ఫ్రీ హోల్డ్ సర్వే జరిగింది. మోపూరు సచివాలయం పరిధిలో సుమారు 276 సర్వే నెంబర్లలో 252 మంది లబ్ధిదారులు, నాగవోలు సచివాలయం పరిధిలో 101 సర్వే నెంబర్లలో 88 ఎకరాల వరకు ఫ్రీ హోల్డ్‌గా ఉన్నాయని వసూళ్లకు తెరతీశారు. అసైన్‌మెంట్ పొలాలు ఫ్రీ హోల్డ్ పేరుతో సెటిల్‌మెంట్‌గా మారుతున్నాయని రైతులను నమ్మించి దందాకు శ్రీకారం చుట్టారు. ఒక్కో ఎకరాకు రూ.20 వేల చొప్పున వసూలు చేసినట్టు ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. తనను స్థానిక ఎమ్మెల్యే పంపారని, ఏదైనా సమస్య వచ్చి ఎమ్మెల్యే వద్దకు వెళ్తే ఆయన తన వద్దకే పంపుతారని విర్రవీగుతూ ముడుపులకు తెరదీసినట్టు సమాచారం. ఇదిలావుండగా సదరు వీఆర్వో పలు దఫాలు సస్పెండ్‌కు గురికావడంతో ఆయన ఎస్ఆర్ లేకుండానే పనిచేస్తుండడం గమనార్హం.

విచారించి చర్యలు తీసుకుంటాం



వీఆర్వో అవినీతి, అక్రమాలపై విచారిస్తాం. ఫ్రీ హోల్డ్ భూముల వ్యవహారంపై నిగ్గు తేల్చుతాం. ఏదైనా అక్రమాలు జరిగినట్టు తేలితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చస్తాం. – మోపూరు శ్రీనివాసులు, తహసీల్దార్, దక్కిలి

కదంబ వనంలో అగ్ని ప్రమాదం

తిరుపతి క్రైమ్: తిరుమలలోని హెచ్వీసీ కదంబ వనంలో సోమవారం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సకాలంలో స్వల్ప మంటలను అదుపు చేశారు.

ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులు

తిరుపతి క్రైమ్: తిరుమలలో తెలంగాణకు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన మునిసాత్విక్(25) తిరుమలలోని కళ్యాణి చౌదరిలో మూడో అంతస్తు పైకెక్కి దూకేస్తానని, హైదరాబాద్‌లోని తన సోదరుణి స్వర్ణరేఖకు సమాచారం అందించాడు. స్వర్ణరేఖ ఏం చేయాలో అర్థం గాక తిరుమల పోలీసులకు సమాచారం అందించారు. ఆపై పోలీసులు చాకచక్యంగా ఆ యువకుడిని కాపాడారు. సదరు యువకుడికి మానసిక స్థితి బాగోలేక ఇలా చేసినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు.